
సాక్షి ఏలూరు

సోమవారం । 6 । మే । 2024



ప్రశాంతంగా నీట్

దేశంలోని వైద్య విద్యా కళాశాలల్లో ప్రవేశాల నిమిత్తం నిర్వహించే నీట్ (నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్) ఉమ్మడి జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. 8లో ▸



వలసల జోరు

సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సమయం దగ్గర పడుతున్న కొద్దీ వైఎస్సార్‌సీపీలోకి వలసలు జోరందుకున్నాయి. ఇతర పార్టీల నేతలు భారీగా వచ్చి చేరుతున్నారు. 8లో ▸



జాతీయ పోటీలకు ఎంపిక

జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఏలూరుకు చెందిన నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారని ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కోశాధికారి తెలిపారు. 8లో ▸

న్యూస్‌రీల్

మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం



మాట్లాడుతున్న ఎన్నికల సాధారణ పరిశీలకులు

ఏలూరు(మెట్రో)/ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఎన్నికల నిర్వహణలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని ఎన్నికల సాధారణ పరిశీలకులు డా.కృష్ణకాంత్ పాఠక్, ఎస్‌ఏ రామన్ అన్నారు. ఆదివారం స్థానిక సీఆర్‌ఆర్ కళాశాల ఆడిటోరియంలో మైక్రో అబ్జర్వర్లకు నిర్వహించిన రెండో విడత శిక్షణా కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఉంగుటూరు, దెందులూరు, ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల సాధారణ పరిశీలకులు కృష్ణకాంత్ పాఠక్ మాట్లాడుతూ నిఘా నేత్రాలతో పరిశీలిస్తూ తప్పిదాలు, ఉల్లంఘనలు సంభవిస్తే వెంటనే ఎన్నికల పరిశీలకులు దృష్టికి తేవాలన్నారు. పోలింగ్ కేంద్రంలో, పీఓ, ఏపీఓలు నిర్వహిస్తున్న విధులను, ఓటింగ్ తీరును నిశితంగా పరిశీలించాలన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలన్నారు. విధి నిర్వహణలో అనుమానాలు ఉంటే సెల్ 9154690877 నంబర్‌కు తెలియజేయాలన్నారు.

పోలింగ్ సెంటర్‌ను పరిశీలించాలి

పోలవరం, చింతలపూడి, నూజివీడు, కైకలూరు, అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎస్‌ఏ రామన్ మాట్లాడుతూ పోలింగ్‌కు ముందు మాక్ పోల్, ఓటింగ్ గది, పోలింగ్ స్టేషన్‌ను పరిశీలించాలన్నారు. జిల్లాలోని 415 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలకు మైక్రో అబ్జర్వర్లను నియమించడంతోపాటు వారికి రెండు విడతలు శిక్షణ అందించామన్నారు. ఈనెల 12న ఉదయం 10 గంటలకు సంబంధిత రిసెప్షన్ కేంద్రాలకు మైక్రో అబ్జర్వర్లు చేరుకోవాలన్నారు. పోలింగ్ అనంతరం తిరిగి కేంద్రానికి చేరుకుని నివేదిక అందించాలన్నారు. కేవలం పోలింగ్ విధానాన్ని పరిశీలించాలే తప్పా మీడియా, ఇతరులతో మాట్లాడకూడదన్నారు. సమస్యలు ఎదురైతే సెల్ 9491041437కు ఫోన్ చేయాలని సూచించారు. మైక్రో అబ్జర్వర్లు విధి నిర్వహణకు సంబంధించి వివరాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కలిగించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, సమగ్ర శిక్షా అభియాన్ ఏపీసీ బి.సోమశేఖర్, ఎల్‌డీఎం నీలాద్రి, కలెక్టరేట్ ఏఓ కె.కాశీవిశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో అర్జున అవార్డు గ్రహీత



జ్యోతి సురేఖకు జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని అర్జున అవార్డు గ్రహీత, డిప్యూటీ కలెక్టర్ వి.జ్యోతి సురేఖ ఆదివారం సందర్శించారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి విచ్చేసిన ఆమె ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో పండితులు ఆమెకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి వేద ఆశీర్వచనాన్ని పలకగా, ఆలయ డీఈఓ బాబురావు చినవెంకన్న జ్ఞాపిక, ప్రసాదాలను అందజేశారు.

ఉద్యోగుల ఓటు హక్కు తిరస్కరించొద్దు

ఉండి: ఎన్నికల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులకు ఎట్టి పరిస్థితుల్లోను ఓటు హక్కును తిరస్కరించవద్దని జాయింట్ కలెక్టర్, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి సీవీ ప్రవీణ్ ఆదిత్య ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఎన్నికల విధుల్లో ఉన్న కొందరు ఉద్యోగులు ఫారం-12ను సకాలంలో సమర్పించకపోవడం వల్ల ఓటు వినియోగించుకోలేకపోతున్నారనే విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు.

అభివృద్ధి మంత్రం.. సంక్షేమ జపం

- వైద్య కళాశాల సాకారం
- తమ్మిలేరు ముంపునకు శాశ్వత పరిష్కారం
- 1.16 లక్షల మందికి గృహయోగం
- రహదారుల అభివృద్ధి
- మెట్ట, ఏజెన్సీలో ఆరోగ్య సిరులు
- రూ.606 కోట్లతో రక్షిత మంచినీరు
- ఐదేళ్ల పాలనలో జిల్లా సమగ్రాభివృద్ధి

హేలాపురి.. ప్రగతి ఝరి

ఏలూరు జిల్లాలో అభివృద్ధి జోరు కనిపిస్తోంది.. వైఎస్సార్‌సీపీ పాలనలో సంక్షేమంతో పాటు అభివృద్ధి పరుగులు తీస్తోంది. పోలవరం ప్రాజెక్టును గాడిన పెట్టడం.. గిరిపుత్రులకు అత్యాధునిక వైద్యసేవలందించడం.. ఏళ్ల నాటి కల ఏలూరులో ప్రభుత్వ వైద్య కళాశాల సాకారం కావడం.. తమ్మిలేరు వరద ముంపునకు శాశ్వత పరిష్కారం చూపించడం.. జాతీయ, రాష్ట్ర రహదారుల అభివృద్ధి .. లక్షల్లో పేదల ఇళ్ల నిర్మాణం.. అడవిబిడ్డలకు వేలాది ఎకరాల భూపంపిణీ వంటివి విజయవంతంగా సాగాయి. జిల్లా సమగ్రాభివృద్ధితో పాటు అన్నివర్గాల అభ్యున్నతి లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారు. – సాక్షి ప్రతినిధి, ఏలూరు




ఏలూరులో ప్రభుత్వ మెడికల్ కళాశాల

వైద్య కళాశాల ఓ చరిత్ర

1980 నుంచి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ప్రభుత్వ కళాశాల కావాలనేది బలమైన డిమాండ్. 2019లో సీఎంగా జగన్ ప్రమాణస్వీకారం చేసిన తర్వాత ఏలూరు, పాలకొల్లులో ప్రభుత్వ వైద్య కళాశాలలు మంజూరయ్యాయి. ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆ సమయంలో డిప్యూటీ సీఎం, వైద్యాశాఖ మంత్రిగా ఉండటంతో ఏలూరులో వైద్య కళాశాల నిర్మాణాన్ని పరుగులు పెట్టించారు. మరోవైపు రూ.60 కోట్లతో అధునాతన భవనం నిర్మించి 2022–23 విద్యా సంవత్సరంలో 150 ఎంబీబీఎస్ సీట్లతో కళాశాలను ప్రారంభించారు. మొత్తంగా రూ.525 కోట్ల ప్రాజెక్టులో భాగంగా వైద్య కళాశాల నిర్మాణ పనులు చేపట్టారు.


ఏలూరు జిల్లా

విస్తీర్ణం	జనాభా
6,577 ච.కిలోమీటర్లు	20,06,684 (2011 లెక్కల ప్రకారం)
గ్రామీణ జనాభా	పట్టణ జనాభా
16,22,314	3,84,370
	ఇళ్ల సంఖ్య
	5,47,790



	అక్షరాస్యత శాతం 70.7
పార్లమెంట్ నియోజకవర్గం 1	అసెంబ్లీ నియోజకవర్గాలు 7
మండలాలు 28	గ్రామ పంచాయతీలు 547
నగరపాలక సంస్థ 1	మున్సిపాలిటీలు 3

పోల'వరం'.. మణిహారం



పోలవరం ప్రాజెక్టు

పోలవరం ప్రాజెక్టును ప్రణాళికాబద్ధంగా గాడిలో పెట్టి కరోనా కష్టకాలంలోనూ పనులు వేగంగా సాగేలా చేశారు. సీఎం జగన్ హయాంలో 48 స్పిల్ వే గేట్ల నిర్మాణం, స్పిల్ చానల్ ఎగువ, దిగువ డ్యాంలు, 2021 జనవరి 11 నాటికి పూర్తి చేసి 6.1 కిలోమీటర్ల గోదావరి ప్రవాహాన్ని మళ్లించారు. సహజసిద్ధ గోదావరి ప్రవాహాన్ని ఇంత భారీ ఎత్తున మళ్లించడం చరిత్రలో ఇదే ప్రథమం. అలాగే తాడువాయిలో 3,095 పునరావాస ఇళ్లను ఒకేచోట మెగా టౌన్‌షిప్ మాదిరి రూ.488 కోట్లతో నిర్మించి లబ్ధిదారులకు అందజేశారు.

తమ్మిలేరు ముంపునకు రక్షణ



ఏలూరులో తమ్మిలేరు రిటైనింగ్ వాల్

ఏలూరు నగరానికి తమ్మిలేరు ముంపు నుంచి రక్షణకు రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు వైఎస్సార్ హయాంలో 2006లో ప్రారంభం కాగా.. అనంతర కాలంలో నిలిచిపోయాయి. ఈ క్రమంలో 2019లో అంచనాలు పెంచి రూ.80 కోట్లతో 6 కిలోమీటర్ల మేర రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు పూర్తి చేశారు. రెండో దశలో 2.50 కిలోమీటర్ల మేర రూ.55.50 కోట్లతో నిర్మాణ పనులు ప్రారంభించి 90 శాతానికి పైగా పనులు పూర్తి చేశారు. ఈ రకంగా ముంపునకు శాశ్వత పరిష్కారం చూపారు.

'కొండ'ంత ఆరోగ్యం



చింతలపూడిలో 100 పడకల ప్రభుత్వాసుపత్రి

జిల్లాలోని ఏజెన్సీ, మెట్ట, కొల్లేరు ప్రాంత వాసులకు ఉన్నత వైద్య అందించేలా పలు ఆస్పత్రులను అప్‌గ్రేడ్ చేశారు. చింతలపూడిలో 100 పడకల ఆస్పత్రి పనులు 90 శాతం పూర్తికావడంతో పాటు వైద్య పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. బుట్టాయగూడెంలో రూ.55 కోట్లతో 150 పడకల మల్టీస్పెషాలిటీ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. నూజివీడులో రూ.25 కోట్లతో ప్రభుత్వాస్పత్రిని సమగ్రంగా అభివృద్ధి చేశారు. జీప్లస్–3 భవనంలో కాన్పులు, చిన్న పిల్లల ప్రత్యేక వార్డులతో సహా అన్ని సౌకర్యాలను వంద పడకలతో సిద్ధం చేశారు.

అన్నదాతలకు అగ్రాసనం

వ్యవసాయ ఆధారిత జిల్లాలో ఐదేళ్ల క్రితం వరకు ఎరువులు, పురుగు మందులు, విత్తనాల కోసం ఆందోళనలు, ధర్నాలు పరిపాటి. ఈ నేపథ్యంలో అన్నదాతల సంక్షేమానికి ప్రభుత్వ పెద్దపీట వేసింది. జిల్లాలో 547 గ్రామ పంచాయతీల పరిధిలో 350 రైతుభరోసా కేంద్రాల (ఆర్‌బీకే) ఏర్పాటుకు సంకల్పించింది. రూ.83 కోట్లతో పనులు ఖరారు చేసి రూ.60.94 కోట్లతో 228 భవనాలను పూర్తి చేసింది. ఆర్‌బీకేల ద్వారా పంటలు కొనుగోళ్లు చేస్తూ దళారీ



నూతనంగా నిర్మించిన శిశు గృహ

వ్యవస్థకు చెక్ పెట్టింది. అలాగే జిల్లాలో 2,35,847 మంది రైతులకు వైఎస్సార్ రైతుభరోసా కింద రూ.1,839.24 కోట్లను నేరుగా సాయం అందించారు. 97,584 మంది రైతులకు సున్నా వడ్డీ పంట రుణాల కింద రూ.22.29 కోట్ల లబ్ధి చేకూర్చారు. వ్యవసాయానికి 9 గంటల ఉచిత విద్యుత్ ద్వారా జిల్లాలో 70,960 సర్వీసులకు రూ.2,467.25 కోట్లు ఖర్చు చేశారు.

పల్లెల్లో ప్రభుత్వ భవనాలు

జిల్లాలో 443 గ్రామ సచివాలయ భవనాల నిర్మాణాన్ని రూ.193.15 కోట్లతో మొదలుపెట్టి 284 భవనాలను రూ.120.18 కోట్లతో పూర్తి చేశారు. 543 రకాల సేవలు సచివాలయాల ద్వారా అందిస్తున్నారు. రూ.56.37 కోట్లతో 271 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటుచేస్తున్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా 610 వైద్య శిబిరాలు నిర్వహించి 2,83,239 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. ఇలా పల్లె ముంగిట్లోనే ప్రజలకు సేవలందిస్తున్నారు.



ఏలూరు శనివారపుపేటలో గ్రామ సచివాలయం

నాడు–నేడుతో బాగు'బడి'

మనబడి నాడు–నేడు పథకంతో ప్రభుత్వ బడుల రూపురేఖలు మారుస్తున్నారు. జిల్లాలో 2,032 పాఠశాలలను రూ.270.75 కోట్లతో అభివృద్ధి చేయడంతో పాటు ఇంగ్లిష్ మీడియం, డిజిటల్ విద్యా బోధన అమలులోకి తెచ్చారు. 206 అంగన్‌వాడీ కేంద్రాల్లో 96 సెంటర్లకు శాశ్వత భవనాల నిర్మాణాలు పురోగతిలో ఉన్నాయి. రూ.26.08 కోట్లతో 54 పీహెచ్‌సీలను నిర్మిస్తున్నారు. జిల్లాలో ఏడు నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఏర్పాటుచేసి పలు కోర్సుల్లో శిక్షణలు ఇస్తున్నారు.



నాడు–నేడులో రూపుదిద్దుకున్న తరగతి గది

'లక్ష'ణంగా ఇళ్ల నిర్మాణం

జిల్లాలో లక్షకుపైగా ఇంటి స్థలాలు, ఇళ్లు ఇచ్చిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిది. మొదట, రెండు విడతల్లో జిల్లాలో 1,16,431 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చి రిజిస్ట్రేషన్లు చేశారు. అలాగే 98,874 మందికి ఇళ్ల నిర్మాణం కోసం రూ.713.17 కోట్లు ఖర్చు చేశారు. కైకలూరు, ఏలూరు మెగా లేఅవుట్లు రాష్ట్రానికే తలమానికంగా నిలిచాయి.

ఇంటింటా సంక్షేమ కాంతులు

జిల్లాలో 2,81,470 మందికి సామాజిక పింఛన్ల రూపంలో రూ.3,880.09 కోట్ల లబ్ధి చేకూర్చారు.
వైఎస్సార్ బీమా కింద 4,554 మందికి రూ.57.32 కోట్లు అందజేశారు.
ఏటా 1,73,699 మంది విద్యార్థులకు రూ.130.15 కోట్ల చొప్పున జగనన్న విద్యా కానుకకు వెచ్చించారు.
1,78,214 మంది విద్యార్థులకు జగనన్న అమ్మఒడి పథకం కింద రూ.1,069.30 కోట్ల లబ్ధి చేకూర్చారు.
1,82,043 మంది చిన్నారులకు జగనన్న గోరుముద్ద ద్వారా రూ.223.43 కోట్లు ఖర్చు చేశారు.
జగనన్న విద్యాదీవెన ద్వారా 38,675 మంది విద్యార్థులకు రూ.383.40 కోట్లు అందజేశారు.
జగనన్న వసతి దీవెన ద్వారా 37,750 మంది రూ.142.96 కోట్లు జమ చేశారు.
జగనన్న చేదోడు ద్వారా 17,935 మందికి రూ.71.74 కోట్లు అందజేశారు.
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.410.18 కోట్ల విలువైన వైద్యసేవలను 1,95,651 మందికి అందించారు.



గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ పనులు

ప్రగతి బాటలు

జిల్లాలో 868.566 కిలోమీటర్ల రోడ్లను రూ.627.96 కోట్లతో అభివృద్ధి చేశారు. కైకలూరు–ఏలూరు రోడ్డు పనులు రూ.56 కోట్లతో చేపట్టగా 76 శాతానికిపైగా పూర్తయ్యాయి. చింతలపూడి–జంగారెడ్డిగూడెం మీదుగా గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు సాగుతున్నాయి. జీలుగుమిల్లి–కొవ్వూరు మధ్య ఎన్‌హెచ్ 365 (బీబీ) పనులు రూ.605 కోట్లతో ప్రారంభమయ్యాయి. రూ.124 కోట్ల వ్యయంతో 516 (డీ) రహదారిని కొయ్యలగూడెం–జీలుగుమిల్లి మధ్య అభివృద్ధి చేశారు.



ఏలూరులో వైఎస్సార్ హెల్త్ క్లినిక్



తాడువాయిలో ఆర్‌అండ్‌ఆర్ కాలనీ



నూజివీడులో ఆధునికీకరించిన ఆస్పత్రి

ఇంటింటికీ కుళాయి

జలజీవన్ మిషన్ ద్వారా రూ.606.08 కోట్లతో పల్లెల్లో రక్షిత మంచినీరు పథకాన్ని అమలు చేస్తున్నారు. అమృత్ 2.0లో భాగంగా ఏలూరులో రూ.129.20 కోట్లతో తాగునీటి సరఫరా, రూ.112.18 కోట్లతో అండర్ డ్రైయినేజీ పనులు ప్రారంభమయ్యాయి.

సాధికారతకు జై కొడుతూ..

జిల్లాలో మహిళా సాధికారత లక్ష్యంగా ప్రభుత్వం పథకాలు అమలు చేసింది. వైఎస్సార్ ఆసరా కింద 35,745 గ్రూపుల్లోని 3,55,315 మంది మహిళలకు రూ.1,305.05 కోట్లు జమచేశారు. 30,917 సంఘాలకు బ్యాంకు లింకేజీల ద్వారా రూ.702 కోట్లు రుణాలందించారు. 43,765 సంఘాలకు రూ.221.99 కోట్లను వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం ద్వారా అందించారు. 39,255 మంది మహిళలకు రూ.546.53 కోట్ల స్త్రీ నిధి రుణాలు అందించారు. 1,16,491 మందికి వైఎస్సార్ చేయూతలో రూ.561.53 కోట్లు జమ చేశారు. వైఎస్సార్ కాపునేస్తం ద్వారా 19,868 మందికి రూ.119.21 కోట్లు, ఈబీసీ నేస్తం ద్వారా 14,274 మందికి రూ.42.82 కోట్లు అందజేశారు.

11,874 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగం

ఏలూరు(మెట్రో): జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు విశేష స్పందన వచ్చింది. ఆదివారం సాయంత్రం నాటికి జిల్లాలో 11,874 మంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. నియోజకవర్గాల వారీగా ఉంగుటూరులో 1,402 మంది, కైకలూరులో 1,305 మంది, నూజివీడులో 1,452 మంది, చింతలపూడిలో 1,662 మంది, పోలవరంలో 2,308, ఏలూరులో 1,827 మంది, దెందులూరులో 1,918 మంది పోస్టల్ బ్యాలెట్ ఓటు వేశారు.

ఓటు వేయడం బాధ్యత : ఓటు వేయడం బాధ్యత అని, ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి సూచించారు. ఏలూరు సీఆర్‌ఆర్ మహిళా కళాశాలలోని ఫెసిలిటేషన్ కేంద్రంలో ఆదివారం ఆమె పోస్టల్ బ్యాలెట్ ఓటు వేశారు. ఈనెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు పటిష్ట ఏర్పాట్లు చేశామన్నారు.




ఏలూరులో ఓటు హక్కు వినియోగించుకున్న జేసీ లావణ్యవేణి, డీపీఓ శ్రీనివాస విశ్వనాథ్

ఓటింగ్ శాతం పెంచేలా.. ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేలా స్వీప్ కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయని స్వీప్ నోడల్ అధికారి, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. ఏలూరు కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కాలేజీలోని ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఆయన పోస్టల్ బ్యాలెట్ ఓటు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో జిల్లాలో 83.75 శాతం ఓటింగ్ నమోదు కాగా ఏలూరు నియోజకవర్గంలో అత్యల్పంగా 68.10 శాతంగా నమోదయ్యిందన్నారు. ఈ ఎన్నికల్లో 92 శాతం ఓటింగ్ శాతం పెంచేలా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఓటర్స్ టర్న్ అవుట్ ప్రణాళికను రూపొందించారని, దీనిలో భాగంగా 2,500 స్వీప్ కార్యక్రమాలు చేపట్టామన్నారు.

సదుపాయాలు భేష్ .. స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో రెండో రోజు పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ సజావుగా జరగడానికి అధికారులు సకల సదుపాయాలు కల్పించారు. ఏర్పాట్లపై ఉద్యోగులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్వో ముక్కంటి, కమిషనర్ వెంకటకృష్ణ పర్యవేక్షించారు.

జగన్‌కు భూములు పంచడమే తెలుసు

ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్ యాదవ్

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి భూములు పంచడమే తప్ప లాక్కోవడం తెలియదని ఏలూరు పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ అన్నారు. జీలుగుమిల్లి మండలం కామయ్యపాలెం సచివాలయ పరిధిలోని గ్రామాల్లో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. భూయాజమాన్య చట్టం వల్ల పలు ప్రయోజనాలు ఉన్నాయని, అయితే చంద్రబాబు ఫేక్ ఐవీఆర్ కాల్స్ చేయిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. నిమ్మగడ్డ రమేష్ తీరుతో రాష్ట్రంలో లక్షలాది మంది అవ్వాతాతలు పింఛన్ల కోసం ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిమ్మగడ్డ అనే వ్యక్తి సూట్ వెనుక ఎల్లో



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్. చిత్రంలో ఎమ్మెల్యే అభ్యర్థి రాజ్యలక్ష్మి

షర్ట్ వేసుకుని తిరుగుతూ వైఎస్సార్‌సీపీపై కుట్రలు చేస్తున్నాడన్నారు. సీఎం జగన్ వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటికే పింఛన్ అందిస్తుంటే అక్కసుతో చంద్రబాబు కుట్రలు పన్నాడన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా తనకు, ఎమ్మెల్యే అభ్యర్థిగా తెల్లం రాజ్యలక్ష్మికి ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి మాట్లాడుతూ పోలవరంలో విధ్వంసం సృష్టించిన వ్యక్తి చంద్రబాబు అని విమర్శించారు. ప్రాజెక్టును చంద్రబాబు ఏటీఎంలా వాడుకున్నారని ప్రధాని మోదీ అనడం నిజం కాదా అని ప్రశ్నించారు. చంద్రబాబు తీరుతో నిర్వాసితులకు ఇబ్బందులు ఎదురవగా సీఎం జగనన్న వారందరికీ న్యాయం జరిగేలా కృషి చేస్తున్నారన్నారు. జగనన్న సంక్షేమ పాలన దేశానికే ఆదర్శమని నార్త్ అమెరికా ఎన్‌ఆర్‌ఐ వింగ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు రత్నాకర్ అన్నారు. పార్టీ మండల కన్వీనర్ చందా ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు బోదా శ్రీనివాసరెడ్డి, నాయకులు ఉప్పల రాంపండు, జెడ్పీటీసీ మల్లం వసంతరావు ఉన్నారు.

క్లుప్తంగా

బాస్కెట్‌బాల్ జాతీయ పోటీలకు ఏలూరు క్రీడాకారులు



జాతీయ బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొంటున్న ఏలూరు క్రీడాకారులు

ఏలూరు రూరల్ : జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఏలూరుకు చెందిన నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కోశాధికారి కె.మురళీకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇండోర్‌లో ఈ నెల 8 నుంచి 15 వరకు 74వ జాతీయ స్థాయి జూనియర్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర బాలికల జట్టుకు ఏలూరుకు చెందిన పి.నాగవినయశ్రీ, డి.పావనిప్రియ, పి.జయశ్రీ ఎంపికయ్యారు. బాలుర జట్టుకు ఏలూరు క్రీడాకారుడు ఈశ్వర్‌తేజ ఎంపికయ్యాడని వెల్లడించారు. వీరు ఇటీవల నూజివీడులో జరిగిన 9వ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటి జాతీయ పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కించుకున్నారని వివరించారు. క్రీడాకారులను అసోసియేషన్ అధ్యక్షుడు కె.కృష్ణారెడ్డి, కార్యదర్శి గవ్వ శ్రీనివాస్ అభినందించారు.

వైఎస్సార్‌ సీపీలోకి వలసల వరద

ఏలూరు టౌన్: ఏలూరు నియోజకవర్గంలో టీడీపీ కూటమి కుట్రలను, అసత్య ప్రచారాలను వైఎస్సార్‌సీపీ నేతలు, క్యాడర్ తిప్పికొట్టాలని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు పార్టీ నేతలు, క్యాడర్ సైనికుల్లా పనిచేయాలని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షులు ఆళ్ల నాని పిలుపునిచ్చారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం 41వ డివిజన్ కార్పొరేటర్ ఈదుపల్లి కల్యాణిదేవి, పార్టీ నాయకులు పవన్‌కుమార్, పసుపులేటి శేషు, ఎండీ మొహిద్దీన్ ఆధ్వర్యంలో 100 మంది టీడీపీ, జనసేన పార్టీల నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. వీరందరికీ ఎమ్మెల్యే నాని పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ చంద్రబాబు మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, వాటిని ప్రజలు నమ్మవద్దని హితవు పలికారు. ఏలూరులో వేలాది మంది పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తే నేడు టీడీపీ మోసపు హామీలను ఇస్తూ ప్రలోభాలకు గురిచేస్తోందని, ప్రజలు విజ్ఞతతో ఆలోచించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏలూరు కో–ఆప్షన్ సభ్యులు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎంఆర్ పెదబాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, మాజీ ఏఎంసీ చైర్మన్ మంచెం మైబాబు, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, కో–ఆప్షన్ సభ్యులు మున్నుల జాన్‌గురునాథ్ ఉన్నారు.




ఏలూరులో ఎమ్మెల్యే ఆళ్ల నాని సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ, జనసేన కార్యకర్తలు




నూజివీడులో చంటినాయన సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన రమణక్కపేట టీడీపీ కార్యకర్తలు, వైఎస్సార్ సీపీలో చేరిన మీర్జాపురం టీడీపీ కార్యకర్తలు

టీడీపీ నుంచి పెద్ద ఎత్తున చేరికలు

నూజివీడు : చంద్రబాబు బారి నుంచి రాష్ట్రాన్ని కాపాడే సత్తా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే ఉందని, రాబోయే రోజుల్లో ప్రజలంతా వైఎస్సార్ సీపీకి ఓటేసి జగన్‌ను మళ్లీ రెండోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాలని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు తనయుడు మేకా వేణుగోపాల అప్పారావు (చంటినాయన) అన్నారు. ముసునూరు మండలం రమణక్కపేటకు చెందిన యాదవులు, ఎస్సీలు కలిపి 50 కుటుంబాలు శనివారం అర్ధరాత్రి చంటినాయన సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వీరందరికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. చేరిన వారిలో ఉల్లాస వెంకటేశ్వరరావు, ఉల్లాస మల్లికార్జునరావు, సాయిల సుబ్బారావు, సాయిల సన్యాసరావు, సాయిల రాజేశ్వరరావు, పటాపంచల కుమార్‌రాజా, కావటి సుబ్బారావు, ఏ అశోకకుమార్, ఏ పురుషోత్తం, డీ నానీ, ఏ భారతి తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా చంటినాయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకా వెంకట ప్రతాప్ అప్పారావుకు, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌లకు ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొండా దుర్గాభవాని, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు మూల్పూరి నాగవల్లేశ్వరరావు, వైస్ ఎంపీపీ కోటగిరి రాజానాయన, నాయకులు కొండా వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

మీర్జాపురంలో..

నూజివీడు మండలం మీర్జాపురంలో టీడీపీకి చెందిన సయ్యద్ బాషా, రాజులపాటి శేషారావు, షేక్ బుజ్జీ, షేక్ బాజీ, షేక్ మీరాసాహెబ్, షేక్ అమీర్ బాషా, షేక్ మీరావలీ, షేక్ రహమతుల్లాలు ఆదివారం చంటినాయన సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వీరందరికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలందరూ పార్టీ అభ్యర్థుల గెలుపుకు సైనికుల్లా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, నాయకులు జోగి ప్రభాకర్‌రావు, ఆరేపల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళాలు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఆదివారం ఇద్దరు భక్తులు రూ.2,02,121 విరాళంగా అందజేశారు. కృష్ణా జిల్లా కలిదిండికి చెందిన పచ్చిగోళ్ల లలితాప్రసాద్ రూ.1,02,121, రాజమండ్రికి చెందిన కవికొండల అప్పల నరసమ్మ రూ.1,00,000 ఆలయ కార్యాలయంలో జమచేశారు. దాతలకు విరాళం బాండ్ పత్రాలను అందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మహిళలు మృతి

నందిగామ: సత్యమ్మను దర్శించుకునేందుకు రోడ్డు దాటుతూ ఇద్దరు మహిళలు మృతిచెందిన ఘటన ఆదివారం రాత్రి నందిగామ మండలంలోని అంబారుపేట వద్ద జాతీయ రహదారిపై జరిగింది. ఎస్ఐ దుర్గా మహేశ్వరరావు కథనం మేరకు.. ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలకు చెందిన బొప్పన స్వరూప రాణి (60) అనారోగ్యానికి గురయ్యారు. ఆమెకు వైద్యం చేయించేందుకు కుమారుడు బొప్పన తారక శ్రీరామకృష్ణ, బంధువైన మరో మహిలతో కలిసి కారులో హైదరాబాద్ బయలుదేరారు. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడుకు చెందిన మరో బంధువు వేగి పద్మజ (50) కారులో ఎక్కించుకున్నారు. నందిగామ మండలం అంబారుపేట వద్ద సత్యమ్మ అమ్మవారికి కొబ్బరి కాయ కొట్టేందుకు బొప్పన స్వరూప రాణి, వేగి పద్మజ కారు దిగి 65వ నంబర్ జాతీయ రహదారి దాటుతున్నారు. అదే సమయంలో విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న మరో కారు వారిని అతివేగంగా ఢీకొంది. 108 సిబ్బంది వారిని హుటాహుటిన నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే ఇద్దరు మహిళలు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

జగనన్న గెలుపులో భాగస్వాములవుదాం

కాట్రేనిపాడు (ముసునూరు): వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోనే వైఎస్సార్ సీపీ గెలుపులో భాగస్వాములు కావాలని, పార్టీలో చేరిన ప్రతి ఒక్కరూ పార్టీ అభివృద్ధి, పురోగతి, గెలుపు కోసం పట్టుదలగా, నిరంతరం శ్రమించాలని ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్, నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు తనయుడు చంటి నాయన కోరారు. కాట్రేనిపాడు గ్రామంలోని టీడీపీ నేతలు అంగడాల శ్రీనివాసరావు, సాంబశివరావు, చిలకంటి బాజిబాబు, శ్రీనివాస్, జెట్టి సాయిబాబు మరో 25 కుటుంబాలకు చెందిన 100 మంది టీడీపీ గ్రామ నేతలు, కార్యకర్తలు గ్రామ పార్టీ అధ్యక్షుడు కంబాల రాంబాబు, సీనియర్ నేతలు దావులూరి నాని, చెంచారావు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే తనయుడు చంటినాయన పార్టీ కండువాలను కప్పి ఘనంగా ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వరికూటి ప్రతాప్, మాజీ ఎంపీపీ ఆర్ కృష్ణకుమారి సుబ్బారావు, వైస్ ఎంపీపీలు కె.రాజా నాయన, పి.గంగాధర్, సొసైటీ అధ్యక్షుడు యనమదల రాజావరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు మూల్పూరి నాగవల్లేశ్వరరావు, మాజీ సర్పంచ్ వెంకటేశ్వరరావు, పార్టీ సీనియర్ నేతలు పాల్గొన్నారు.



కాట్రేనిపాడులో చంటినాయన, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

ప్రశాంతంగా నీట్ పరీక్ష

ఏలూరులోని 3 కేంద్రాల్లో 1,320 మంది హాజరు



విద్యార్థి చెవిపోగుకు స్టిక్కర్ అతికించిన సిబ్బంది

ఏలూరు (ఆర్ఆర్‌పేట): దేశంలోని వైద్య విద్యా కళాశాలల్లో ప్రవేశాల నిమిత్తం నిర్వహించే నీట్ (నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్) ఆదివారం ప్రశాంతంగా జరిగింది. పరీక్షా కేంద్రాల వద్దకు అభ్యర్థులను ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకూ మాత్రమే అనుమతిస్తారని ముందుగానే ప్రకటించడంతో విద్యార్థులు ఉదయం 11 గంటల నుంచే తమకు నిర్దేశించిన పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. ఆయా పరీక్షా కేంద్రాల్లో తమకు కేటాయించిన తరగతి గదుల కోసం కేంద్రం బయట ఏర్పాటు చేసి సూచిక బోర్డులో తమ నెంబర్లను వెతుక్కుని కేంద్రాల్లోకి ప్రవేశించారు. పరీక్షా కేంద్రాలలో సంబంధిత అధికారులు విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించారు. వారి వద్ద ఎలక్ట్రానిక్ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. సీఆర్ఆర్ అటానమస్ కళాశాలలో పరీక్ష కేంద్రానికి వచ్చిన విద్యార్థుల్లో ఒక విద్యార్థి చెవి పోగు ధరించడంతో అతని చెవిపోగుకు అధికారులకు ప్లాస్టర్ వేసి పరీక్షా కేంద్రంలోకి పంపారు. విద్యార్థుల అడ్మిట్ కార్డులను, వారి గుర్తింపు కార్డులతో సరిపోల్చిన అనంతరమే వారిని లోనికి అనుమతించారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.20 గంటల వరకూ నిర్వహించిన పరీక్షకు ఏలూరులోని మూడు కేంద్రాల్లో కలిపి మొత్తం 1,320 మంది హాజరయ్యారు. సీఆర్ఆర్ అటానమస్ కళాశాలలో 504 మందికి గాను 491 మంది, సీఆర్ఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో 504 మందికి గాను 487 మంది, ఆదిత్య డిగ్రీ కళాశాలలో 353 మందికి గాను 342 మంది హాజరయ్యారు. ఈ పరీక్షలకు సిటీ కో–ఆర్డినేటర్‌గా వైఎస్ఎస్ చంద్రశేఖర్ వ్యవహరించగా, సీఆర్ఆర్ అటానమస్ కళాశాల అబ్జర్వర్‌గా ఎం.కృష్ణ, సీఆర్ఆర్ పాలిటెక్నిక్ కళాశాల పరిశీలకునిగా జీ ప్రభు, సత్రంపాడు ఆదిత్య డిగ్రీ కళాశాల పరిశీలకునిగా ఓ.శ్రీహరి వ్యవహరించారు. విద్యార్థులతో పాటు పరీక్షా కేంద్రాలకు వచ్చిన తల్లిదండ్రులు ఎండలోనే నిరీక్షించాల్సి వచ్చింది.



పరీక్షా కేంద్రం వద్ద సందడి



ఏలూరులో పరీక్ష కేంద్రానికి చేరుకుంటున్న విద్యార్థినులు



ఏలూరు సీఆర్‌రెడ్డి కళాశాల వద్ద రూమ్ నంబర్‌ను సరిచూసుకుంటున్న విద్యార్థులు



విద్యార్థినిని మెటల్ డిటెక్టర్‌తో తనిఖీ



పరీక్షా కేంద్రం జడను సరిచేస్తూ..

లారీ ఢీకొని ఆటో డ్రైవర్ మృతి



ఘటనా స్థలంలో రాంబాబు మృతదేహం

నూజివీడు: ఆటోను లారీ ఢీకొన్న సంఘటనలో ఆటో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. హనుమంతులగూడెంకు చెందిన ఆటో డ్రైవర్ కర్నికోటి రాంబాబు (35) ఆదివారం ఆటో నడుపుకుంటూ నూజివీడు వస్తుండగా విస్సన్నపేట వైపు వెళ్తున్న లారీ వేగంగా వస్తూ ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో నుజ్జునుజ్జు కాగా పాటు ఆటో డ్రైవర్ లారీ చక్రాల కింద పడటంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ప్రమాదం సంభవించినప్పుడు ఆటోలో ప్రయాణికులు ఎవరూ లేరు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

గోడ కూలి భవన నిర్మాణ కార్మికుడి మృతి

పోలవరం రూరల్: శిథిలావస్థలో ఉన్న ఇంటి గోడ కూలి భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందినట్లు స్టేషన్ హెచ్‌సీ కె.శ్రీనివాస్ చెప్పారు. పోలవరం గ్రామానికి చెందిన పోలవరపు వీరభద్రం (46) భవన నిర్మాణ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం తన ఇంటి సమీపంలో శిథిలావస్థలో ఉన్న ఇంటి గోడ వద్ద ఉండగా ఒక్కసారి గోడ కూలి మీద పడటంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలవరం వైద్యశాలకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

మూగజీవాల దాహార్తి తీర్చేందుకు కృషి



నీటి తొట్టెలను అందజేస్తున్న రామ్‌శ్లోక్, నెస్ట్ ఆర్గనైజేషన్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: వేసవిలో మూగ జీవాల దాహార్తి తీర్చేందుకు పలు చోట్ల నీటి తొట్టెలు ఏర్పాటు చేస్తున్నట్లు రామ్‌శ్లోక్ ఫౌండేషన్ సభ్యులు మంతెన గోపాలం చెప్పారు. ఆదివారం స్థానిక వెటర్నరీ ఆసుపత్రిలో రామ్‌శ్లోక్ ఫౌండేషన్, నెస్ట్ కన్సర్‌వేషన్ సొసైటీ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నీటి తొట్టెలు పంపిణీ చేశారు. గోపాలం మాట్లాడుతూ పట్టణంలో రోడ్లపై తిరిగే గోవులు, కుక్కలు, పక్షులు వంటి మూగ జీవాలకు వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. రోడ్డుపై మూగజీవాల కొరకు నీటిని అందించాలనుకునే వ్యక్తులకు వీటిని పంపిణీ చేస్తామన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ పాలకొల్లు, మాంటిస్సోరిస్ స్కూల్ లజపతిరాయ్‌పేట సంస్థలు ఒకొక్కరు రూ. 10 వేలు చొప్పున 100 తొట్టెలను అందజేశారన్నారు. నెస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలో పలు కూడళ్లలో నీటి తొట్టెలను ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే ఇంటి వద్ద ప్రహరీలపై పక్షుల కొరకు నీటిని ఏర్పాటు చేయడానికి కూడా చిన్న కుండీలను ఏర్పాటుచేస్తున్నామన్నారు. నెస్ట్ ఆర్గనైజేషన్ సభ్యులు మనీష్, రామ్‌శ్లోక్ ఫౌండేషన్ సభ్యులు లేళ్ల వాసు, నంబూరి స్వామి, తాడి శ్రీనివాసు, చేగొండి ప్రభాకర్, గోటేటి రాజా, సలాది వేణు, గనిరాజు పాల్గొన్నారు.

టీడీపీ చింతలపూడి అభ్యర్థి సొంగాను ప్రాసిక్యూట్ చేయాలి

రిటైర్డ్ ఎంఈఓ ఎస్.ధర్మదాసు



ఏలూరు (ఆర్ఆర్‌పేట): చింతలపూడి అసెంబ్లీ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి సొంగా రోషన్ కుమార్‌ను ప్రాసిక్యూట్ చేయాలని రిటైర్డ్ మండల విద్యాశాఖాధికారి సేవ ధర్మదాసు డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా ఎన్ఆర్‌గా ఉంటూ, తన ఓటును ఫారమ్ 6ఏ ద్వారా నమోదు చేయకుండా లోకల్ ఓటర్‌గా ఎపిక్ నంబర్ డబ్ల్యూఎక్స్‌డబ్ల్యూ 1469121గా నమోదు చేయించుకోవడం ఎన్నికల నియమావళికి విరుద్ధమే కాకుండా ప్రజాప్రాతినిధ్య చట్టం సెక్షన్ 8ఏ, 123 (2) ప్రకారం అనర్హత వర్తిస్తుందన్నారు. అంతేకాకుండా, ఏప్రిల్ 22న ఆయన దాఖలు చేసిన అఫిడవిట్‌లో అమెరికాలోని వెస్ట్ వర్జీనియాలో గల బ్యాంక్ ఖాతాలను, ఇన్సూరెన్స్ విషయాలను కప్పిపుచ్చి, దానిపై తాను లేవనెత్తిన అభ్యంతరంతో ఏప్రిల్ 25న మరో నామినేషన్, అఫిడవిట్ దాఖలు చేసి తనకు అమెరికాలో వెస్ట్ వర్జీనియాలో గల బ్యాంక్ ఖాతాలను, ఇన్సూరెన్స్ విషయాలను చేర్చి తన డొల్లతనాన్ని తానే బయట పెట్టుకున్నారన్నారు. ఇది పూర్తిగా ఎన్నికల ప్రవర్తన నియమావళికి విరుద్ధమని స్పష్టం చేశారు. అలాగే రిప్రజెంటేషన్ ఆఫ్ పీపుల్స్ యాక్ట్, ఐపీసీ సెక్షన్ల కింద ప్రాసిక్యూషన్ చేయాలని కోరుతూ రాష్ట్రపతి నుంచి కలెక్టర్ వరకు అందరికీ ఫిర్యాదులు చేశామన్నారు. ఇటీవల చింతలపూడిలో దళితులతో నిర్వహించిన సమావేశంలో అగ్రవర్ణాలకు చెందిన వారిని వేదికపై కూర్చోపెట్టి దళితులను వేదిక కింద కూర్చోపెట్టి రోషన్ కుమార్ దళితులను అవమానించారని, అలాగే ఎన్నికల ప్రచారంలో భాగంగా చెప్పులు ధరించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేయడం అంబేద్కర్‌ను అవమానించడమేనన్నారు. రోషన్ కుమార్ ఎన్నికల్లో గెలిచినా తరువాత అతనిపై అనర్హతకు గురవుతారని, ఈ మేరకు చింతలపూడి నియోజకవర్గ ప్రజలు విజ్ఞతతో ఆలోచించి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

లారీని ఢీకొన్న ట్రావెల్ బస్సు

తణుకు: తణుకు మండలం దువ్వ గ్రామ పరిధిలోని జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీని ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. హైదరాబాదు నుంచి యానం వెళుతున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు సూర్యారావుపాలెం రోడ్డు నుంచి హైవే పైకి ధాన్యం లోడుతో వచ్చిన లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు ముందు భాగం నుజ్జునుజ్జు అయింది. ఈ ప్రమాదంలో బస్సులోని ప్రయాణికులకు గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

గోదావరిలో స్నానానికి దిగి ట్యాక్సీ డ్రైవర్ గల్లంతు

పోలవరం రూరల్: గోదావరి నదిలో స్నానానికి దిగిన ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. హెచ్‌సీ శ్రీనివాస్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జంగారెడ్డిగూడెంకు చెందిన 42 సంవత్సరాల ట్యాక్సీ డ్రైవర్ ఆదివారం ఉదయం కొందరితో కలిసి పోలవరంలోని ఆంజనేయస్వామి గుడికి వెళ్లాడు. అక్కడ గోదావరి రేవులో స్నానానికి దిగగా ప్రమాదవశాత్తు లోతుగా ఉన్న ప్రాంతంలో గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టినట్లు హెచ్‌సీ తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని చెప్పారు.

పశ్చిమకు మణిహారం..

ఫిషింగ్ హార్బర్

సుదీర్ఘ తీరప్రాంతం ఉన్న నరసాపురంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణం దశాబ్దాల నాటి కల. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో మత్స్యకారుల కల నెరవేరింది. ఉమ్మడి పశ్చిమ జిల్లా అభివృద్ధికే ఇది గీటురాయి కానుంది. జిల్లాకు మణిహారంగా మారనున్న మేజర్ ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులు నరసాపురంలో ప్రారంభమయ్యాయి.

– నరసాపురం

హార్బర్ లేక పట్టణంలోని వశిష్ట గోదావరి గట్టున నిలిపి ఉంచుతున్న వేట బోట్లు



నెరవేరిన దశాబ్దాల కల

నరసాపురంలో రూ.429.43 కోట్లతో ఫిషింగ్ హార్బర్ నిర్మాణం

పనులు చేపట్టిన విశ్వసముద్ర ఇంజినీరింగ్ సంస్థ



హార్బర్ లేకపోవడంతో కష్టంతో సముద్రంలోకి వేట బోటు పంపుతున్న మత్స్యకారులు

నరసాపురం మండలం బియ్యపుతిప్పలో మేజర్ ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి గత ఏడాది మే నెలలో ఏపీ మారిటైమ్ బోర్డు టెండర్లు పిలవగా, విశ్వసముద్ర సంస్థ పనులు దక్కించుకుంది. పర్యావరణ అనుమతులతో పాటు ఇతర సాంకేతిక అనుమతులు కూడా వచ్చేశాయి. దీంతో టెండర్లు దక్కించుకున్న విశ్వసముద్ర ఫిబ్రవరిలో ప్రాథమిక పనులు ప్రారంభించింది. 19 కిలోమీటర్ల సముద్ర తీరప్రాంతం ఉన్న నరసాపురంలో బియ్యపుతిప్ప ఫిషింగ్ హార్బర్ నిర్మించాలనే డిమాండ్ దశాబ్దాలుగా ఉంది. ఈ ప్రాంతంలో 5 వేల మత్స్యకార కుటుంబాలు వేటపై ఆధారపడి జీవిస్తున్నాయి.

తీరంలో అపార మత్స్యసంపద

మత్స్య సంపద, ఆక్వా ఎగుమతుల్లో ఉమ్మడి పశ్చిమ జిల్లాకు రాష్ట్రంలోనే ప్రత్యేక స్థానం ఉంది. ఇక కొత్తగా ఏర్పడ్డ డెల్టాప్రాంతంతో కూడిన పశ్చిమ నుంచి దేశ, విదేశాలకు భారీగా ఆక్వా ఎగుమతులు జరుగుతుంటాయి. రొయ్యలు, చేపల సాగు పెరగడంతో ఆక్వారంగం పుంజుకుంది. ఏటా కోట్లాది రూపాయల విదేశీ మారకద్రవ్యం ఆక్వా పుణ్యమా అని జిల్లాకు వస్తోంది. ఇటు తీరప్రాంతంలో సముద్ర మత్స్యసంపద ద్వారా కూడా భారీగా ఆదాయం సమకూరుతుంది. ఏటా నరసాపురం తీరంలో రూ.300 కోట్ల విలువచేసే మత్స్య ఎగుమతులు సాగుతాయి. కానీ హార్బర్ లాంటి మౌలిక వసతులు ఉంటే మరో 40 శాతం ఎగుమతులు పెరిగే అవకాశం ఉంది. ఆక్వారంగంలో ఈ సవాళ్లను ఎదుర్కోవాలనే లక్ష్యంతోనే ఇప్పటికే నరసాపురంలో ఫిషరీస్ యూనివర్సిటీ ఏర్పాటు చేసింది.

600 ఎకరాల విస్తీర్ణంలో హార్బర్ నిర్మాణం ఇలా..

బియ్యపుతిప్ప ఫిషింగ్ హార్బర్‌ను 600 ఎకరాల విస్తీర్ణంలో రూ 429.43 కోట్ల భారీ వ్యయంతో నిర్మించాలని జగన్ ప్రభుత్వం నిర్ణయించింది. స్థల సేకరణ 2022 లోనే పూర్తిచేశారు. హార్బర్ డిజైన్‌పై కూడా ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ప్రత్యేక దృష్టి పెట్టి తయారు చేయించారు. సుమారు 300 బోట్లు నిలిచేలా ప్లాట్‌ఫామ్‌లు నిర్మించనున్నారు. సముద్రంలో లభ్యమైన సరుకును నిల్వచేసుకోవడానికి కోల్డ్ స్టోరేజ్‌లు నిర్మిస్తారు. ఏకకాలంలో 500 టన్నుల మత్స్య ఉత్పత్తులను నిల్వచేసుకోవడానికి కోల్డ్ స్టోరేజ్‌లు నిర్మిస్తున్నారు. ఇక తుపానులు వంటి ప్రకృతి విపత్తుల సమయంలో వేట సాగించే మత్స్యకారుల రక్షణకు సంబంధించి సామగ్రి హార్బర్‌లో అందుబాటులో ఉంటాయి. 216 జాతీయ రహదారి అభివృద్ధి పనులు పూర్తవ్వడంతో తీరం నుంచి రవాణా సౌలభ్యంకూడా మెరుగయ్యింది. ఇప్పుడు తీరంలో హార్బర్ నిర్మాణం సాగుతుండటంతో ఆక్వా ఉత్పత్తుల ఎగుమతులకు మహర్దశ పట్టనుంది. హార్బర్ కమ్ కార్గో ఫోర్ట్ నిర్మాణం చేస్తున్నారు కాబట్టి ఇతర జిల్లాల నుంచి కూడా ఎగుమతులు జరిగే అవకాశం ఉంటుంది.

హార్బర్ విషయంలో టీడీపీ డ్రామాలు

2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ బియ్యపుతిప్ప హార్బర్ విషయంలో అనేక డ్రామాలు కొనసాగించింది. నియోజకవర్గంలో పెద్దసంఖ్యలో ఉన్న మత్స్యకారులను ఎప్పుడూ ఓటు బ్యాంకుగానే చూసిన చంద్రబాబు ప్రభుత్వం ఫిష్ ల్యాండింగ్ సెంటర్ కడుతున్నామంటూ మోసగిస్తూ వచ్చింది. 2019లో ఎన్నికలు సమీపిస్తున్న వేళ, లోకేష్‌ను తీసుకొచ్చి హడావిడిగా రూ.13 కోట్ల వ్యయంతో ఫిష్‌ల్యాండింగ్ సెంటర్‌కు శంకుస్థాపన చేయించారు. అయితే 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే స్థానిక ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు రూ.13 కోట్ల వ్యయాన్ని రూ.20 కోట్లకు పెంచి అంచనాలు తయారుచేశారు. మళ్లీ స్థానికంగా మేజర్ ఫిషింగ్ హార్బర్ అవసరాన్ని గుర్తించి హార్బర్ కమ్ కార్గో ఫోర్ట్ నిర్మాణానికి రూ.429.43 కోట్ల భారీ వ్యయంతో పూనుకున్నారు. నిజానికి కేంద్ర ప్రభుత్వం హార్బర్ నిర్మాణం చేయాల్సి ఉంది. అయితే కేంద్రం హార్బర్ నిర్మాణానికి నిరాకరించడంతో ఇక్కడి ప్రజలకు ఇచ్చిన హామీ ఎట్టి పరిస్థితుల్లోనూ నెరవేర్చాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ నిధులతోనే హార్బర్ నిర్మాణానికి పూనుకోవడం విశేషం.

అభివృద్ధి చరిత్రలో మైలురాయి



బియ్యపుతిప్ప ఫిషింగ్ హార్బర్ నిర్మించాలని దశాబ్దాలుగా మత్స్యకారులు కోరుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చలవతో పనులకు శంకుస్థాపన జరిగింది. నిజానికి కేంద్రం ఇక్కడ హార్బర్‌కు ఒప్పుకోలేదు. కానీ ఇక్కడి ప్రజలకు హామీ ఇచ్చామని చెప్పి సీఎం జగన్ నరసాపురంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి పూనుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వమే హార్బర్ నిర్మాణం చేసేలా స్వయంగా సీఎం శంకుస్థాపన చేశారు. పనులు ప్రాథమికంగా ప్రారంభమయ్యాయి. వచ్చే ఐదేళ్లలో నిర్మాణ పనులు పూర్తవుతాయి. గోదావరి జిల్లాల అభివృద్ధి చరిత్రలో ఇది ఓ మైలురాయి.

– ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ చీఫ్ విప్

దేవుని చల్లని దీవెనలతో...

వైఎస్సార్ సీపీ అభ్యర్థులు ఆదివారం చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రానున్న ఎన్నికల్లో వారికి విజయం చేకూరాలని భగవంతుడిని కోరుతూ పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మంచి చేసేవారికి ఆ దేవుని చల్లని దీవెనలు ఎప్పుడూ ఉంటాయని ఆశీర్వదించారు.



ఏలూరు టౌన్: ఏలూరు పెనుయేల్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని



ఏలూరు (ఆర్ఆర్ పేట): శాంతినగర్‌లోని మన్నా చర్చ్‌లో ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్‌ను ఆశీర్వదిస్తున్న బిషప్ ఎలీషారాజు, పాస్టర్ జ్యోతిరాజు



భీమవరం (ప్రకాశం చౌక్): చర్చిలో విశ్వాసులను ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



దెందులూరు: శ్రీరామవరం చర్చిలో ప్రార్థనలు చేస్తున్న దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

చింతలపూడి ఎత్తిపోతల పథకం

పూర్తిచేయిస్తా

జిల్లాలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా సుదీర్ఘకాలం పాటు పనిచేసిన ఆయన తాజాగా రాజకీయ రంగంలోకి అడుగుపెట్టారు. జిల్లాలో సౌమ్యుడిగా పేరు సంపాదించారు. రాజకీయాలకు కొత్తే అయినా చింతలపూడి నియోజకవర్గంపై పూర్తి అవగాహన ఉందని, అన్ని రంగాల్లోనూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానంటున్నారు. తాను స్థానికుడిని అని.. అమెరికా నుంచి రాలేదని.. నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని చెబుతున్నారు. తనలోని సేవా భావాన్ని గుర్తించే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనకు అసెంబ్లీకి పోటీ చేసే అరుదైన అవకాశం కల్పించారని అంటున్నారు. చింతలపూడి వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కంభం విజయరాజు మనోగతం ఇది.

– చింతలపూడి



చింతలపూడి అసెంబ్లీ అభ్యర్థి కంభం విజయరాజు

ఇంటర్వ్యూ

ప్రశ్న : రాజకీయాల్లోకి రావాలని ఎందుకు అనిపించింది ?

విజయరాజు : దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి పరిపాలన చూసి రాజకీయాలంటే ఆసక్తి కలిగింది. 2009లో నియోజకవర్గం ఎస్సీ రిజర్వుడు అవ్వడంతో అప్పటికే సేవా కార్యక్రమాలు చేస్తున్న నాకు ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలన్న కోరిక ఏర్పడింది.

ప్రశ్న : నియోజకవర్గంపై అవగాహన ఉందా ?

విజయరాజు : ఉంది. నేను ఉద్యోగ రీత్యా జిల్లాలోని ఏలూరు, జంగారెడ్డిగూడెం ప్రాంతాల్లో 20 సంవత్సరాల పాటు పని చేసిన అనుభవం ఉంది. ఇక్కడి ప్రజలు, వారి సమస్యలు అన్నీ నాకు తెలుసు. నేను పుట్టి పెరిగింది ఈ నియోజకవర్గంలోనే. నియోజకవర్గ అభివృద్ధిపై పూర్తి అవగాహన ఉంది.

ప్రశ్న : వైఎస్సార్ సీపీ టిక్కెట్ దక్కడంపై మీ అభిప్రాయం ?

విజయరాజు : వైఎస్సార్ సీపీ తరఫున పోటీ చేసే గౌరవం దక్కడం అదృష్టంగా భావిస్తున్నా. అంబేడ్కర్ భావజాలంతో పని చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కరోనా సమయంలో కూడా ప్రజల్ని కన్నబిడ్డల్లా చూసుకున్నారు. ఆయన అడుగుజాడల్లో పేద ప్రజలకు అండగా ఉంటూ సేవ చేసి చూపించాలనేది నా తపన.

ప్రశ్న : ప్రజల స్పందన ఎలా ఉంది ?

విజయరాజు : నియోజకవర్గంలో ప్రజలు ఎక్కడికి వెళ్లినా ఆదరిస్తున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లపాటు అందించిన సంక్షేమ పథకాలను గుర్తు చేసుకుని వైఎస్సార్ సీపీకే ఓట్లు వేసి గెలిపిస్తామని చెబుతున్నారు. ముఖ్యమంత్రిగా జగనన్న మాత్రమే ఉండాలని కోరుకుంటున్నారు.

ప్రశ్న : మీ బలమేంటి? ఎమ్మెల్యేగా గెలిస్తే నియోజకవర్గానికి ఏం చేస్తారు?

విజయరాజు : మా నాయకుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డే నా బలం. ప్రజల ఆశీస్సులతో ఎన్నికల్లో గెలుపొందాక నియోజకవర్గ రైతుల కల చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయిస్తా. చింతలపూడి, జంగారెడ్డిగూడెం పట్టణాలను సుందరీకరణ చేసి అభివృద్ధి చేస్తా. ఇండస్ట్రియల్ హబ్‌గా కూడా ఈ ప్రాంతం అభివృద్ధి చెందాల్సి ఉంది. ముఖ్యంగా ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తా.

ప్రశ్న : వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి లాభించే అంశాలు ఏంటి?

విజయరాజు : నవరత్న పథకాలు, జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనా దక్షత, నూరుశాతం మేనిఫెస్టో అమలు చేయడం మాకు వచ్చే ఎన్నికల్లో లాభించే అంశాలు. మీ ఇంట్లో మేలు జరిగితేనే నాకు ఓటు వేయండి అని మా నాయకుడు బహిరంగంగా పిలుపునిచ్చారు. దేశంలో ఇలా మా పాలన నచ్చితేనే ఓటు వేయండి అని చెప్పిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే.

ప్రశ్న : వచ్చే ఎన్నికల్లో మీ పార్టీ ఎన్ని స్థానాలు సాధిస్తుంది?

విజయరాజు : ప్రజలు వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. మా పార్టీ ఈ సారి 160 స్థానాల్లో గెలుపొంది చరిత్రను తిరగరాస్తుంది.

ప్రచార పర్వం

ప్రజలతో మమేకం

పల్లెపల్లెలో ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. వైఎస్సార్ సీపీ అభ్యర్థులు ప్రజలతో మమేకమవుతూ ముందుకు సాగుతున్నారు. తమ గ్రామాలకు వచ్చిన నేతలకు ప్రజలు హారతులు పడుతూ.. గజమాలలతో సత్కరిస్తూ ఆత్మీయ స్వాగతం పలుకుతున్నారు. సంక్షేమ సారథి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని.. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించుకునే పూచీ తమదని భరోసా ఇస్తున్నారు.

- సాక్షి, నెట్‌వర్క్



ఏలూరు టౌన్: ఏలూరులో 2వ డివిజన్‌లో నిర్వహించిన సభలో మాట్లాడుతున్న ఏలూరు అభ్యర్థి ఆళ్ల నాని



భీమడోలు: పాతూరులో ప్రజలతో మమేకమైన ఉంగుటూరు అభ్యర్థి పుప్పాల వాసుబాబు



జంగారెడ్డిగూడెం: ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్, ఎమ్మెల్యే అభ్యర్థి విజయరాజులపై పూల వర్షం కురిపిస్తున్న ప్రజలు



బుట్టాయగూడెం: జీలుగుమిల్లి మండలం కామయ్యపాలెంలో మహిళలతో మాట్లాడుతున్న పోలవరం అభ్యర్థిని తెల్లం రాజ్యలక్ష్మి



ఆగిరిపల్లి: వడ్లమానులో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రాజ్యసభ సభ్యులు గొల్ల బాబురావు, నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



దెందులూరు: శ్రీరామవరంలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న దెందులూరు ఎమ్మెల్యే అభ్యర్థి కొఠారు అబ్బయ్యచౌదరి

అలరించిన నృత్యాలు

జీలుగుమిల్లి మండలం కామయ్యపాలెం సచివాలయ పరిధిలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు కారుమూరి సునీల్‌కుమార్, తెల్లం రాజ్యలక్ష్మి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా డోలు కొమ్ముల నృత్యాలు చేస్తూ గిరిజనులు ఆకట్టుకున్నారు.

– బుట్టాయగూడెం

